# ఎద్దులూ - బండి

అస్తమానంలో సూర్యుడు యుద్ధ భయపు మనిషిలాగ ఎర్రగా క్రుంగిపోతున్నాడు. భయంకరమయిన అనుమానం లాగ సాయంకాలం మీద. చీకట్లు ముసురుతున్నాయి! ఊరవతలి పాడుబావిలో చిక్కని సాలెగూళ్ళూ... చీకట్లను ఒడగట్టినా, నీళ్ళున్నదీ లేందీ తెలియడం లేదు!-

ఆత్మహత్య అనే భారీ ప్రయత్నం తన యిరవై రెండో ఏట... రెండోసారో మూడోసారో చేస్తున్నాడు విశ్వం. గండమారి పుండయిన బ్రతుకూ, కుటుంబం అనే బరువూ అతగాడి మీద పూర్తిగా పడ్డాయి గనక... యింక తియ్యని కలలు కూడా కష్టమే! మధుర మయిన భావనలకి కూడా అవకాశం లేనప్పుడు... భవిష్యత్తు నక్షత్రాలు లేని ఆకాశం అయినప్పుడు విశ్వం చచ్చిపోదామనుకున్నాడు.

బస్తీకి వెళ్ళి ఉక్కబోసే నాగరికతలో కాలేజీ ఉపన్యాసాలు వినలేక పోయాడు విశ్వం. రమ్య హర్మ్యం... రంజయిన జీవితం... నోచుకోలేకపోయాడు విశ్వం. తండ్రి జీవితంనుంచి విముక్తుడై వెళ్ళి పోవడంతో; ఎనభైరాళ్ళ వుద్యోగం, అమ్మా, చెల్లి, తమ్ముడూ అనే బంధనాలు అతని ఊహాగానాలను కూడా బంధిచేశాయి!

విశ్వం చిక్కని సాలెగూళ్ళ వెనుకకి చూద్దామనుకున్నాడు. చచ్చిపోతే అందమయిన అమ్మాయి; రంగయిన మేడా; పెద్ద చదువులూ; బూటూ సూటూ ఏమీ రావు- కానీ, రాలేదన్న బెంగ మాత్రం వుండదు!...

తీరా యిందులో పడిన తర్వాత చావక పోతే? ... ఏ కాలో చెయ్యో విరిగి కుళ్ళిపోతే!... చాలా భయం వేసింది! ఆ బాధ మరీ దుర్భరం... దుర్భరమయిన జీవితం తరిమేసినప్పుడు చచ్చిపోదామన్న యిష్టం.... నిశ్శబ్దమూ నిర్జనమూ అయిన చోటులో అంత బలంగా వుండదు!... ఆశ పెనవేస్తుంది! చావు రాదేమోనన్న అనుమానం వస్తుంది!

చావు రాదన్న భయమేమిటి? నిర్ధారణ చేసుకుని వురిపోసుకున్నా వస్తుంది కదా! రాదు రాదు...

విశ్వం-కరణంగారి అమ్మాయిని చూసేడు. ఆ పిల్ల నూతిలో గెంతేసింది. తెల్లవారేదాకా నీళ్ళలో విరిగిపోయిన కాలుతో ఉండిపోయింది!- విశ్వానికి చమట పోసింది!... వెంకుగాడు పెళ్ళాంమీద కోపంతో రైలు క్రిందకని పరిగెత్తి బుర్ర పెట్టినట్టే పెట్టేడట!... అని వాడంటాడు. కానీ, ఆ దౌర్భాగ్యుడు... దేవుడు వాడి కళ్ళూ, కాళ్ళూ తీసుకున్నాడు!

బంధనాలు తెంచుకున్న విశ్వం... చీకట్లో నూతిలో దూకడానికి భయంవేసి తప్పించుకోలేక తిరుగుముఖం పట్టేడు.

ఏవగింపుగానో, జాలిపడో సూర్యుడు జారిపోయేడు. అమావాస్య అంబరాన మినుకు మినుకుమని బిలబిలా నక్షత్రాలు పుడుతున్నాయి.

ఒక్కో ఆత్మ హత్యా ప్రయత్నంలో ఒక్కో తియ్యని కల, కమ్మని కోర్కె కరిగిపోతూంది విశ్వంలో! ఇంక ఒక అందమయిన అమ్మాయిని ప్రేమించడం అన్న కోర్కె ఒకటి వుండిపోయింది! ఆడది అంటే తెలీని యువకుడు అయిన విశ్వానికి - మళ్ళీ యింటికి వెళ్ళేసరికి ఏ సమస్య నెత్తికెక్కుతుందో! కోరికల రెక్కలు విరిచీవచ్చునుగానీ, సమస్యలని చంపలేరుకదా!

బరువుగా, తగరంబస్తా నెత్తికెత్తుకున్నట్లు నడుస్తున్నాడు విశ్వం! బ్రహ్మజెముడు గుబుర్ల మధ్యనుంచి నిశ్శబ్దాన్ని కోస్తూ కీచురాళ్ళ కారుధ్వని. మొన్న కురిసిన వాన ఇంకా, యింకని గతుకుల మట్టిరోడ్డు! ఎవరు పోయించారో తెలియదుగాని, ఎవ్వరూ బాగుచెయ్యలేదు!... చేస్తారో తెలియదు!

ఒక రెండెద్దుల బండి పడుతూ లేస్తూ నడుస్తున్న యుద్ధ ఖయిదీలాగ నీడపడని చీకట్లో లీలగా కనిపించింది. బండిమీది వ్యక్తి చీకట్లో స్పష్టంగా కనిపించడుగానీ విశ్వానికి తెలుసు అది నారన్న అని, ఆ బండిలో కందుల బస్తాలుంటాయని.

నారన్న తెరలు తెరలుగా తెర్లివచ్చే దగ్గూ, అడుగడున ఎద్దులు పడే యమయాతనా విశ్వం సహించలేక పోతున్నాడు! గతుకుల్లో ఒడుదుడుకులు పడుతున్నది బండీ, ఎద్దుల మెడమీది పుండు - తన మెడమీదే వుందనిపించింది విశ్వానికి! ఆ ఎద్దులు అంతకంటే ప్రాణాలు విడిస్తే హాయి! ఇంకా హాయి ఏమిటి?... కానీ, అది జరగదు.

నారన్నవే ఆ ఎద్దులూ-బండీ. ఆతగాడి ఆస్తి ఆ ఎద్దులు-బండి మాత్రమే! ఆస్తి ఏమిటి, అవే అతని బ్రతుకు!

దగ్గుతెర తెగినప్పుడు నారన్న దేవుణ్ణి గొణుగుతున్నాడు. బహుశా ప్రార్థిస్తున్నాడేమో! యెద్దుల యాతనా, నారన్న తపనా కూడా సహించడం విశ్వం చెయ్యలేక పోతున్నాడు!

తరుముకు వస్తున్న చీకటీ - నిశ్శబ్దం అతని అడుగులను నడిపిస్తున్నాయి.

నారన్న గురించి ఊళ్ళో అంతా జాలిగా మంచివాడంటారు. ధర్మాత్ముడు అంటారు కొందరు! కొందరు పాపం, ఖర్మ- అనుకుంటారు. విశ్వం అమ్మ చెబుతుంది; "నారన్నకి ఆ ఎద్దులూ- బండీ

మామగారిచ్చిన ఆస్తిట! దాంతో పెళ్ళాం పిల్లల్ని సాకుదామనుకొన్న నారన్నని నిండా పదేళ్ళవకుండానే యిద్దరి పిల్లలతో వదిలేసి అతగాడి భార్య బ్రతుకు చాలించుకుంది"అని.

కష్టాలన్నీ నారన్న పడ్డాడనీ, అయినా అరవైఏళ్ళు నిండిన నారన్న యింకా... అతగాడి దగ్గుతెర, పడుతూ లేచే బండీ- ఎద్దులబుస... చూసిన విశ్వం నారన్న మీద సానుభూతితో కొంచెం తన సంగతి విస్మరించుకున్నాడు.

నారన్న కొడుకు మిల్టరీలోకి పారిపోయాడు. నారన్న ఏడిచాడట! "తెల్లోళ్ళకి యీ నల్లాడెం సాయం చేస్తాడు? అని అందర్నీ అడిగి ఏడిచేవాడట! కానీ కొడుకు రాముడుగాడి అజాపజా లేదు! కూతుర్ని అత్తారింటికి పంపితే అది వురిబోసుకుంది! నిజం దైవానికి కెరుక!

దభేలున బండి పెద్ద గుంటలో పడ్డట్లుంది. చీకటి గనక లేకపోతే విశ్వం ఆదృశ్యం భరించలేడు.

ఏమో యింకెన్నాళ్ళు యీ నారన్న జీవితం? ఈ గతుకుల రోడ్డుమీదే- ఏమో నారన్న ఆయువు అయిపోవచ్చు! ఈ ఎద్దులు అతడి జీవితంనుంచి తప్పుకోవచ్చు, ఇది ఎన్నో జతో? ఎన్ని జతలు అయ్యాయో ఇదివరకు!

విశ్వానికి నారన్న చావటమంటే భయం వేసింది! సీత కెంత కష్టం? సీత సంగతి కదిలేసరికి విశ్వానికి ఆ దౌర్భాగ్యపు టవస్థలో కూడా ఎవరయినా మామగారు తనకి ఒక అమ్మాయిని యింత కట్నాన్ని యివ్వగూడదా- అనిపించింది! యువకులకు వెచ్చని ఆలోచన అది!

తనూ ఒక పెద్ద వ్యాపారి అయి కావాలంటే మామగారికి కట్నం యావత్తూ తిరిగి యిచ్చేవచ్చును. కట్నం పుచ్చుకోవడం నైచ్యమేమో!? ఊహుఁ కాదు! ....

ఊరుబయట చిమ్మ చీకటి, పేరుకున్న నిశ్శబ్దంలాగ బ్రతుకు గంభీరత! అతగాడికి ఏ ఆలోచనా స్థిరంగా వుండటం లేదు! అడుగడుగున అంతరాయాలు తట్టుకుంటూ అతని ఆలోచనలు గతుకుల రోడ్డుమీద బండీలాగ కదులుతూన్నాయి.

మళ్ళీ ధబేలున బండి చక్రం గుంటలో కూలబడిపోయిందిగాబోలు! బ్రతుకెంత యాతన? బ్రతకడం కోసం యెంత ప్రయాస! ఐనా ఈడ్చుకు పోవాల్సిందే! గభిక్కున ఒక్కసారి నారన్న మీద జాలి వేసింది విశ్వానికి. నిజానికి ఇది జీవితం మీద కలిగిన వింత. ఆశ్చర్య కరమయిన సృష్టి రహస్యం మీది విరక్తి!

సీత నారన్నకి మనుమరాలు. కూతురు ఉరిబోసుకుంది! కూతురుకు ఆ ఒక్కగానొక్క కూతురే, నారన్నకి కొడుకూ, కూతురూ అన్నీ అయింది. విశ్వం సీతను చిన్నప్పట్నుంచీ ఎరుగును. ఒక బళ్ళోనే -తను పెద్దబడిలో ప్రవేశించేదాకా ఆడుకున్నారు.

ఈ తాటితోపుల్లో ముంజెకాయలు కొట్టుకోడం... గిల్లీకజ్జాలాడుకోడం... కరణంగారి అమ్మాయితో

మాటలు మానేయడం... బుజ్జాయి గాడితో కుస్తీ- అన్నీ గుర్తు ఉన్నాయి! సీత నిత్యమూ తనకు కనిపించడం వల్లనో, స్వయాన తాను బీదవాడయి పేదపిల్లను ఆలోచించలేక పోవడం వల్లనో యీ మధ్య సీత దూరమయ్యింది- విశ్వం స్మృతి పథంనించి.

ఎద్దుల బుస... బండి బరువైన కిర్రు- సీత అందం - అంతా యివాళ కళ్ళకు కట్టినట్లయింది విశ్వానికి! మళ్ళీ నారన్న దగ్గుతెర తెగిపోడంతో తెలివి వచ్చినట్లయింది.

ఊబిలో కూరుకున్న చక్రం! అబ్బ! ఈ యాతన-తపన- తాను యింటికెళ్ళేసరికి గంజినీళ్ళయినా దక్కుతాయో లేదో నారన్నకి! కానీ, బ్రతకడం మీద యీ ఆశ-బ్రతుకు లాగడం లోని యీ రహస్యం - విశ్వం కరిగిపోయి నరాలన్నీ కదిపి బండి చక్రం పట్టాలని, ముందుకు కదిలాడు.

ఏదో అవినాభావ సంబంధం తమ యిద్దరి జీవితాల మధ్యా వున్నట్లు తోచింది... కాని అంతలో ఒక్క ఉదుటున ఊబిలోనుంచి యివతలపడ్డది చక్రం!

బరువంతా అటు ఒరిగింది!... ఒడుదుడుకు తట్టుకోలేక... బండీ నారన్న దగ్గుతెలరలను తెంపేస్తూ బోల్తా పడింది!...

"అమ్మా!" అన్న నారన్న నీరసమయిన మూలుగు విన్న విశ్వం గుండెల్లో చెమట పట్టింది! కాళ్ళు చల్లబడి... భయం పాదరసంలాగ నరాలమీదికి పాకిపోయింది!...

అతను తేరుకుని తమాయించుకొనే సరికి... చీకట్లో పడగా నేలకరచుకున్న బండి... బస్తాలు... రక్తం మడుగుగట్టి నారన్న!... విశ్వం చూసేడు.

విశ్వం భయానకమయిన యీ దుర్ఘటనకి ఎంతమాత్రమూ సిద్ధమయి లేడు!... ఐనా ధైర్యం చేసి... గుభిక్కున ముందుకు దూకి కొయ్యబారిన చేతులతో నారన్న తల నదిమి తన ఒళ్ళో పెట్టుకున్నాడు!

తలపాగా తొలగించి, పంచెను... ఒక చేత్తోనే చీరి... కట్టుగట్టే ప్రయత్నం చేసేడు! కానీ, నెట్టుకొస్తున్న నెత్తురు ఆగలేదు!...

ప్రాణాలు తరుగుకు పోయే బాధతో 'సీతా, సీతా' అని ఏడుస్తున్నాడు నారన్న!..."

"ఫర్వాలేదు... నారన్నా..." గొంతు తడిచేసుకుని విశ్వం పెదిమలు కదుపుతున్నాడు.... ఏమనాలో... ఏం చెయ్యాలో?... విశ్వంలోని ప్రతి అణువూ అవిరై, "దైవమా!" అని మింటి కెగసినట్లు; అతని మనసులో దేవుడి తలంపు కదిలింది!...

"ఎవరు బాబూ? ..." ముసలి నారన్న ఎగశ్వాసతో అడిగేడు. అవి స్పష్టంగా అతని అంతిమ ఘడియలు!... రక్తం పొర్లిపోకుండా ఆపగలిన విశ్వం కొంత ధైర్యం వహించి... "నేనూ... వెంకటేశులుగారి విశ్వాన్ని..." అని చెప్పాడు.

"అయ్యో!... సీతా!... ఆ ఎర్రిబాగుల్ది... నిన్ను... చెప్పు... తూండేది!... నువ్వే.... దానికి.... దిక్కు....

దిక్కు... బాబయ్యా!...'' ముసలాడికింక శ్వాస అందలేదు!

ఎత్తి జోడిద్దామనుకున్న చేతులు చైతన్యహీనమయ్యేయి!...

"ఫర్వాలేదు నారన్న! ... ఒక్క క్షణంలో వూళ్ళో కెడతా!... నీ సీతకి నేనున్నానుగా!... అంతా బాగుంటుంది... భయం వద్దు!...."-విశ్వం ఏమంటున్నాడో అతనికే సరిగ్గా తెలియదు!...

ముసలాడు దగ్గు తెరలకి; శ్వాస అందక... రక్తం అయిపోతూండగా... సీతకోసరం ఏడుస్తున్నాడు!...

ఒక్కసారి బలం కూడగట్టుకుని... "సీత... చెప్పింది! .... నిన్ను.... దేవుడు....అంది"-విశ్వం త్రుళ్ళిపడ్డాడు.

ఛెళ్ళున వెన్నుపూసలోంచి విద్యుత్ జారినట్లయింది! గాయంమీద తన కండువా కూడా చుట్టి- "సీతా... ఏం చెప్పింది?"అనకుని తర్కించుకుంటూ.. వూళ్ళోకి పరిగెత్తేడు.

సాగిలపడ్డ ఎద్దులూ... బండీ- రక్తం మడుగులో నారన్న!-

విశ్వం నలుగుర్నీ తీసుకువచ్చేసరికి యింకా కొన వూపిరి వుంది ముసలాడికి!- పెల్లుబికిన దు:ఖంలాగ సీత నారన్న మీద పడి ఏడుపూ ఎక్కిళ్ళూ!...

వూళ్ళో ఆయుర్వేదం డాక్టరూ... పంచాయితీ శర్మా... యింకా రావాలి!... విశ్వం వాళ్ళకోసరం మెడసాచి చూస్తున్నాడు!...

నిజానికి అతగాడు, సీత... నారన్న... ఆ దయనీయ దృశ్యం చూడలేక మెడను అటు రిక్కిస్తున్నాడు.

(1958, హంస)